ఈనాడు
నంద్యాల
గురువారం అక్టోబరు 17, 2024

15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

జిల్లా అభివృద్ధిలో భాగంగా ఏటా 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులకు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర- 2047 విజన్‌లో భాగంగా జిల్లాను రాష్ట్రంలోనే ముందు నిలపాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో స్థూల జాతీయోత్పత్తి, ఆదాయ వృద్ధిరేట్లపై బుధవారం జిల్లా అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగాలతో పాటు విద్య, వైద్యం, నీటి పారుదల తదితర అన్ని విభాగాల్లో అభివృద్ధి నివేదికలు తయారు చేసే విధానంపై నిపుణులతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాలకు సురక్షిత మంచినీటిని సరఫరా చేస్తే ప్రజలు ఆరోగ్యవంతులై జీడీపీ పెరుగుతుందన్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

సౌర విద్యుత్తు కేంద్ర భూముల పరిశీలన

అవుకు మండలంలో భారీ సౌర విద్యుదుత్పత్తి కేంద్రం నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రతిపాదిత ప్రాంతాన్ని బుధవారం జేసీ విష్ణుచరణ్ సందర్శించి వివరాలు సేకరించారు. జూనుతల, మారేమడుగుల, పిడ్డిక్రపల్లె తండాల పరిధిలో రూ.10 వేల కోట్లతో గ్రీన్‌కో ఎనర్జీ భారీ సౌర విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. సౌరపలకల ఏర్పాటుకు అవసరమైన 4,800 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం గతేడాది కేటాయించింది.



భూమిని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న జేసీ, అధికారులు


నిబంధనల మేరకు నిర్మాణ సంస్థ నిర్ణీత లీజు మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించడంతో తొలిదశ 200 ఎకరాల భూమిని సంస్థకు అప్పగించనున్నారు.

– న్యూస్‌టుడే, అవుకు

దుక్కిలో దుఃఖం

- 'ముసురు' కొన్న కష్టాలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న శాస్త్రవేత్తలు

ఖరీఫ్ కాలం ముగిసింది.. అరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చింది.. ఇలాంటి పరిస్థితిలో వచ్చిన అల్ప పీడనం అన్నదాతలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.. ఏకదాటిగా కురుస్తున్న ముసురు వర్షాలకు కోత దశలో ఉన్న ఉల్లి కుళ్లిపోతోంది.. వి'పత్తి' వచ్చింది.. శాఖీయ దశలో ఉన్న మిరప కుళ్లుతోంది.. అధిక వర్షాలు కల'వరి'ంత తెచ్చిపెట్టింది.. మొక్కజొన్న మొలకెత్తుతోంది... అమ్మకానికి సిద్ధంగా ఉన్న రాసులను చినుకులు ముంచుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వివరించారు.



- న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

పత్తి: పత్తి పంట నీటి ముంపునకు గురైతే పిందెలు, కాయలు రాలిపోయి ఆకులు ఎర్రబారి వాడిపోతుంటాయి. పొలంలో నీటిని తీసేసి ఎండగా ఉన్నప్పుడు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లేదా 10 గ్రాముల యూరియాను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుతం కాయకుళ్లు తెగులు బ్యాక్టీరియా, శిలీంధ్రాల ద్వారా వ్యాపించి పంటకు నష్టాన్ని కలుగజేస్తాయి. నివారణకు 0.1 మి.గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్+3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్+కాసుగామైసిన్ 1.5 గ్రాముల లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

టమాటా: ప్రస్తుతం టమాటా కోత దశలో ఉంది. అధిక వర్షాలకు పంటలో వేరుకుళ్లు, బ్యాక్టీరియల్ మచ్చలు ఎక్కువగా వచ్చే అవకాశముంది. నివారణకు ట్రైకోడెర్మావిరడి 5 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్+కాసుగమైసిన్ 1.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి వేరు, కాయ తడిచే విధంగా చల్లుకోవాలి.

పొగాకు: వర్షానికి పొగాకులో ఇనుపధాతు లోపం కనిపిస్తుంది. దీనివల్ల ఆకులు పసుపు రంగులోకి మారి పాలిపోతాయి. నివారణకు అన్నభేది 5 గ్రాములు, నిమ్మ ఉప్పు 1 గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఉల్లిగడ్డ: ఉల్లి పంట గడ్డ ఊరే దశలో ఉంది. పొలంలో అధికంగా నీరు నిల్వకుండా చూసుకోవాలి. వర్షాలకు ఉల్లిగడ్డకు కుళ్లు తెగులు వస్తుంది. కుళ్లు నివారణకు కార్బెండిజం+మాంకోజెబ్ 2 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 50 శాతం డబ్ల్యూపీ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఫోన్ చేయండి.. సందేహాలు నివృత్తి చేసుకోండి

అధిక వర్షాలకు పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర సందేహాల నివృత్తికి నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఎమ్మిగనూరు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి తెలిపారు. కార్యాలయం పనివేళల(ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు)ల్లో డాక్టర్ రాఘవేంద్రచౌదరి (77023 66115), డాక్టర్ మౌనిక (96032 93514), డాక్టర్ శ్రీచందన (94937 95145), డాక్టర్ నిరంజన్‌రెడ్డి (93460 45968) చరవాణి నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

కంది: కంది పూత దశలో ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు మారుకా మచ్చల పురుగు, పచ్చపురుగు ఆశిస్తుంది. నివారణకు ముందుగా వేపనూనె 5 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉద్ధృతిని బట్టి క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. వర్షాలకు పూత రాలకుండా బోరాన్ 1.5 గ్రాములు లేదా 19.19.19 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి చల్లుకోవాలి.

మొక్కజొన్న: వర్షానికి మొక్కజొన్నలో తుప్పు తెగులు ఆశిస్తుంది. పంట పెరిగాక ఆకులపై పొక్కులు గోధుమ వర్ణం నుంచి నలుపు రంగుకు మారుతాయి. దీన్ని తుప్పు తెగులు అంటాం. నివారణకు మాంకోజెబ్ ఎకరానికి 500 గ్రాములు, 200 లీటర్ల నీటిలో కలిపి తెగులు తీవ్రతను బట్టి ఒకటి లేదా రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. ఇప్పటికే కోసిన మొక్కజొన్న దిగుబడులు తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలి.

సెనగ: శనగ పంటను అక్టోబరు 15 నుంచి నవంబరు 15 వరకు రబీలో విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. సెనగ అక్కడక్కడ వేసి రెండు వారాలైంది. అలాంటి పొలాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి.

ప్రధాన పంట	వరి	మొక్కజొన్న	కంది	మిరప	పత్తి	వేరుశనగ	ఉల్లి	టమాట
సాగైంది (హెక్టార్లలో)	72,326	50,590	40,107	8,710	6,619	7,009	3,183	2,660

మిరప: ప్రస్తుతం శాఖీయ దశలో ఉంది. వర్షాలకు కాయకుళ్లు, కొమ్మకుళ్లు తెగులు ఆశించే అవకాశముంది. నివారణకు టేబ్యుకొనజోల్+సల్ఫర్ 2 గ్రాములు లేదా డైఫెన్‌కొనజోల్ 0.5 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

వేరుసెనగ: ప్రస్తుతం చేతికొచ్చిన వేరుసెనగ పంటను వర్షాలు తగ్గిన తర్వాత తొలగించాలి. ఇప్పటికే తొలగించిన పంటను కుప్పలుగా వేసి టార్పాలిన్లు కప్పి పెట్టుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు.

జొన్న: జొన్నలో వర్షానికి మొవ్వ ఈగ లేదా మొవ్వ తొలుచు పురుగు ఆశిస్తుంది. సుడి ఎండిపోయి మొక్కలు చనిపోతాయి. నివారణకు ల్యాండాసైహాలెత్రిన్ 1 మి.లీ. లేదా సైపర్‌మెత్రిన్ 1 మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

వరి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అగ్గి తెగులు ఆశిస్తుంది. ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడుతాయి. ఇవి ఆకులంతా వ్యాపించి ఆకులు ఎండి రాలిపోతాయి. నివారణకు ట్రైసైక్లాజోల్ 0.6 గ్రాములు లేదా కాసుగామైసిన్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రెండు గంటల్లో కుండపోత

- జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం



శిరివెళ్ల: ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వక్కిలేరు వాగు

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. బుధవారం ఉదయం 8.30 నుంచి 12 గంటల వరకు 432.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉదయం 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. 12 గంటల వరకు దొర్నిపాడు 33.6, బనగానపల్లి 30.6, శిరివెళ్ల 29.6, నంద్యాల 25.6, బేతంచెర్ల 25.4, మహానంది, ప్యాపిలి 22.8, కోవెలకుంట్ల 22.6, సంజామల 22, గోస్పాడు 21.6, ఉయ్యాలవాడ 18.8, అవుకు మండలంలో 17.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు జిల్లాలో 507.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. పోలీసు, విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. నదులు, వాగుల్లో వరద ప్రవాహంపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు.

అహోబిలంలో వైభవంగా
మహా పూర్ణాహుతి



మహా పూర్ణాహుతిని నిర్వహిస్తున్న అర్చకులు

పవిత్రోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో మహా పూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిగింది. మంగళవారం రాత్రి ఆరంభమైన ఈ ఉత్సవం బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. జ్వాలా నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవిలను హోమ మండపంలో కొలువుంచి అర్చకులు హోమాలు జరిపారు. దిగువ అహోబిలంలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరిపారు. 21వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరగనున్నాయి.

– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

భ్రమరాంబాదేవికి
లక్ష కుంకుమార్చన



పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం రాత్రి భ్రమరాంబాదేవికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. పరోక్ష సేవలో భాగంగా 24 మంది భక్తులకు గోత్రనామాలతో లక్ష కుంకుమార్చనలు చేయించారు. ఈవో డి.పెద్దిరాజు దంపతులు పాల్గొన్నారు. ఉదయం జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

హడావుడిగా సెలవు ప్రకటన

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు బుధవారం హడావుడిగా సెలవు ప్రకటించారు. ఉదయం నుంచి జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో 9.30 గంటల సమయంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి పాఠశాలలకు సెలవు ప్రకటించాలని ఆదేశాలు జారీ చేశారు. ఉదయం నుంచే వర్షాలు కురుస్తున్నా.. పిల్లలు పాఠశాలలకు వెళ్లిన తర్వాత సెలవు ప్రకటించారు. దీంతో చాలామంది పిల్లలు ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. కొన్ని గ్రామీణ మార్గాల్లో వాగులు పొంగడంతో విద్యార్థులు ఇళ్లకు చేరుకోవడం ఆలస్యమైంది. ఉదయం 11 గంటల తర్వాత వర్షాలు తెరిపివ్వడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

మద్యం సీసాపై
ఖద్దరు ముద్ర



కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో మద్యం దుకాణ అనుమతులు దక్కించుకున్న తెలంగాణ రాష్ట్ర వ్యాపారులకు జిల్లా నేతలు చుక్కలు చూపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 204 మద్యం దుకాణాలు కేటాయించిన సంగతి తెలిసిందే. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తులు కర్నూలు, కోడుమూరు, డోన్, కోవెలకుంట్ల, శ్రీశైలం ఇతరత్రా స్టేషన్ పరిధిలో సుమారు 45 దుకాణాలు దక్కించుకున్నారు. వాటిని ఏర్పాటు చేసుకునేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలను ఆశ్రయించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. వారి అనుమతి తీసుకోనిదే దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం సాధ్యపడటం లేదు. ప్రజాప్రతినిధులను సంప్రదించిన తెలంగాణ వ్యాపారులకు పలు ఆంక్షలు విధిస్తూ దౌర్జన్యం చేస్తున్నారు. వ్యాపారంలో 30 నుంచి 70 శాతం వరకు భాగస్వామ్యం ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నారు. గద్వాల జిల్లాకు చెందిన ముఖ్యనేతలు కర్నూలు జిల్లా నేతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

జిల్లాలో కొత్త మద్యం దుకాణాలు బుధవారం తెరుచుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 75 శాతం మద్యం వ్యాపారులు ఐఎంఎల్ డిపో మద్యం పొందారు. ధరల విషయంలో కొంత గందరగోళం నెలకొంది. కర్నూలు జిల్లాలో బుధవారం సాయంత్రం వరకు 65 మంది అనుమతిదారులు డిపోలో మద్యం తీసుకున్నారని తెలిసింది. కొందరు మద్యం వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకునే పనిలోనే ఉన్నారు. రూ.99 మద్యం సీసాలు వచ్చేందుకు మరో వారం రోజులు, పూర్తి స్థాయిలో అన్ని బ్రాండ్లు వచ్చేందుకు మరో 10 రోజులు సమయం పట్టనుంది.

ఎక్కడ ఎలాంటి ఆంక్షలు

- కోడుమూరు స్టేషన్ పరిధిలో ఓ నాయకుడి దౌర్జన్యం కారణంగా పలువురు తెలంగాణవాసులు దుకాణాలు ఏర్పాటు చేసుకోలేదని తెలిసింది. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి సుంకేసుల పరిధిలో దుకాణం పెట్టుకునేందుకు అనుమతించకపోవడంతో ఆయన మరో గ్రామంలో ఏర్పాటు చేసుకున్నారని తెలిసింది. ఓ తెలంగాణ వ్యాపారికి కోట్ల బాసటగా నిలవడంతో ఏర్పాటు చేసుకున్నారు.
- నగర శివారులో రెండు మద్యం దుకాణాలను దక్కించుకున్న ఓ వ్యాపారి బుధవారం తన దుకాణాన్ని తెరిచేందుకు వీలుగా ఓ చోట బ్యానర్లు కడుతుండగా ఆయన్ను కొందరు అడ్డుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధితో మాట్లాడుకోవాలని సూచించారు. దీంతో ఆయన్ను 'గౌరవంగా' ఆ ప్రజాప్రతినిధి తరపున వ్యవహారాలు చక్కబెట్టే పెద్దల దగ్గరకు తీసుకెళ్లారు. వాటా ఎంతిస్తారన్న విషయాన్ని తేల్చాలని సూచించారు. ఆ విషయం తేలకుండా దుకాణం తెరవలేరని, ఒకవేళ తెరిచినా వ్యాపారం చేసుకోలేరని సున్నితంగా హెచ్చరించడంతో ఆయన దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆయన 30శాతం వాటా అడిగినట్లు ప్రచారం జరుగుతోంది.
- కోవెలకుంట్లలో దుకాణం దక్కించుకున్న వ్యాపారులు బుధవారం రాత్రి వరకు ఏర్పాటు చేసుకోలేదని తెలిసింది. ప్రజాప్రతినిధులు సిఫారసులతో పోస్టింగులు పొందిన మద్య నిషేధ, ఆబ్కారీశాఖ అధికారులు, అటు పోలీసు అధికారులు ఈ విషయంలో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.
- నంద్యాల జిల్లాలో అనుమతులు దక్కించుకున్న కొందరు తెలంగాణ వ్యాపారులు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలకు అనుమతి అమ్ముకోక తప్పలేదు.



ఉపాధి పనుల్లో భాగంగా తవ్విన పక్కనే వేసిన మట్టి

చెరువు చెడింది..
వరద భయపెడుతోంది

- ఐదేళ్లు పట్టించుకోని గత వైకాపా ప్రభుత్వం
- నిధులివ్వక మరమ్మతులూ చేయలేని దుస్థితి

నీటి వనరులు నిండా ప్రవహిస్తున్నాయి.. చెరువుల్లోకి నీరు చేరుతోంది.. అల్ప పీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.. భారీ వర్షాలతో ఎక్కడ చెరువు కట్టలు తెగిపోతాయోనని కర్షకులు ఆందోళన చెందుతున్నారు. వీటి నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసింది. ఐదేళ్లలో ఐదు పైసలివ్వలేదు.. చిన్ననీటి పారుదల శాఖ అధికారులు పలుమార్లు నిధుల కోసం ప్రతిపాదనలు చేసినా.. జగన్ సర్కారు పైసా విదల్చలేదు. కట్టలు బలహీనంగా మారాయి.. ముళ్ల పొదలు పెరిగాయి.. తూములు తెరిచే పరిస్థితి లేకుండా పోయింది.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, పత్తికొండ

వరదొస్తే కట్టలు తట్టుకోగలవా

- ఉమ్మడి జిల్లాలో చెరువులు, బోర్లపై ఆధారపడి చాలా ప్రాంతాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న చెరువులు 60, ఆలోపు ఆయకట్టు ఉన్నవి 250 ఉన్నాయి. మొత్తం 310 చెరువుల్లో 4,411 ఎంసీఎఫ్టీల నీటి సామర్థ్యం ఉంది.
- నంద్యాల జిల్లాలోని 25 మండలాల్లో 100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న చెరువులు 105 ఉన్నాయి. వంద ఎకరాల్లోపు ఆయకట్టు ఉన్నవి 158 ఉండగా మొత్తం 263 చెరువుల్లో 3,923 ఎంసీఎఫ్టీల నీటి సామర్థ్యం ఉంది.

జిల్లా	చెరువులు	ఆయకట్టు
కర్నూలు	310	33,113
నంద్యాల	263	48,516

రూ.6 కోట్లు మింగేశారు

అమృత్ సరోవర్ పథకం కింద ఉపాధిహామీ నిధులతో 2022లో కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 75 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మొత్తం రెండు విడతల్లో వీటిని బాగు చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఒక్కో చెరువుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.6 కోట్లు ఖర్చు చేశారు. పథకంలో భాగంగా అన్నిపనులు పూర్తి చేశామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అవేమి కనిపించడం లేదు. చాలా చెరువుల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. చెరువు కట్టలపై మొక్కల జాడలేదు. ఆత్మకూరు, నంద్యాల, పాణ్యం మండలాల్లో చెరువుల్లో వెయ్యి క్యూబిక్ మీటర్ల పూడిక తీసినట్లు దస్త్రాల్లో నమోదు చేశారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన పనుల్లో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి.

జపాన్ సహకారం నీళ్లపాలు

జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేటివ్ ఏజెన్సీ సౌజన్యంతో 14 చెరువుల మరమ్మతులు, అభివృద్ధికి రూ.7.20 కోట్లు మంజూరయ్యాయి. ఐదు చోట్ల పనులు పూర్తవ్వగా తొమ్మిది అసంపూర్తిగా వదిలేశారు.

99 తటాకాలనూ వదిలేశారు

106 చెరువుల్లోకి కృష్ణా జలాలు మళ్లించాలని తెదేపా హయాంలో నిర్ణయించారు. తొలి విడత 68 పనులకు శ్రీకారం చుట్టారు. అంతలోనే వైకాపా గద్దెపై కూర్చొంది. మరో 11 చెరువులను చేర్చి అంచనాలు పెంచారు. నిర్మాణ వ్యయం కాస్త రూ.254 కోట్లకు చేరింది. పనులు మాత్రం పూర్తిచేయలేదు.

జగన్ మొండిచెయ్యి

- ఆంధ్రప్రదేశ్ సమగ్ర సాగునీటి వ్యవసాయ పరివర్తన పథకం (ఏపీఐఐఏటీపీ) కింద ఉమ్మడి జిల్లాకు నాలుగేళ్ల కిందట రూ.52.04 కోట్లు మంజూరయ్యాయి. 34 ఇరిగేషన్ చెరువులకు వీటిని కేటాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి 50 శాతం నిధులు భరించే విధంగా ప్రాజెక్టు మంజూరైంది. కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేసింది. అప్పటి వైకాపా ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయకపోవడంతో పనులు పూర్తి కాలేదు.
- రుద్రవరం మండలంలో రెండు చెరువులు, బండిఆత్మకూరు, శిరివెళ్ల, ఉయ్యాలవాడ, గడివేముల, జూపాడు బంగ్లా, డోన్ మండలాల్లో ఒక్కోటి చొప్పున తటాకాలకు మరమ్మతులు జరుగలేదు.
- కర్నూలు జిల్లాలోని దేవనకొండ మండలంలో 2, ఆదోని 3, పత్తికొండ, హొళగుంద, ఆస్పరి, సి.బెళగల్, కౌతాళం, హాలహర్వి మండలాల్లో ఒక్కో చెరువుల అభివృద్ధి జరిగే అవకాశం లేకుండాపోయింది.
- జూపాడుబంగ్లాలోని కరివేముల, తంగడంచ, అవుకు మండలంలోని ఉప్పలపాడు, దేవనకొండ మండలంలోని సేతలమర్రి, పత్తికొండలోని ఊరి చెరువులో పనులే జరగలేదు. మిగతా చోట్ల 40 శాతమే జరిగాయి.

భక్తులు సంతృప్తి చెందేలా అన్నప్రసాదం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించే భక్తులు సంతృప్తి చెందేవిధంగా అన్నప్రసాదం అందించాలని దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు సిబ్బందికి సూచించారు. దేవస్థానం ఆధ్వర్యంలోని అన్నపూర్ణ భవన్ భోజనశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వంటలను పరిశీలించారు. వంటశాల, భోజనశాల, అన్నదాన ప్రాంగణాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలని పర్యవేక్షకుడు సి.మధుసూదన్‌రెడ్డిని ఆదేశించారు. అన్నప్రసాద వితరణలో తాజా కూరగాయలే ఉపయోగించాలని స్పష్టం చేశారు. భోజనాల కోసం భక్తులు అధిక సమయం వేచి ఉండకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సిబ్బంది భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని చెప్పారు. రానున్న కార్తిక మాసంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

నైపుణ్యాల తోట.. ఉపాధికి బాట
- 8లో

23 మంది గైర్హాజరు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 23 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో2 సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం వందమంది అభ్యర్థులకు గాను 90, మధ్యాహ్నం వందకు 87 మంది హాజరైనట్లు వెల్లడించారు.

నైపుణ్యాల తోట.. ఉపాధికి బాట

- పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం
- అగ్రశ్రేణి సంస్థల్లో వృత్తి శిక్షణకు అవకాశం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకుంటే మెరుగైన ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందొచ్చు. నిరుద్యోగ యువత ఉజ్వల భవితను పొందాలనే సదాశయంతో కేంద్రం పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని తెచ్చింది. అగ్రశ్రేణి సంస్థల్లో శిక్షణ పొంది నైపుణ్యాలు పెంచుకునేందుకు ఈనెల 12 నుంచి పేర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో, కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిధిలో కళాశాలలు, ఐటీఐ కళాశాలలు, ఉన్నత పాఠశాల విద్య, ఇంటర్, డిప్లొమా చదివే దాదాపు 60 వేలకు పైగా విద్యార్థులకు ఇదొక సువర్ణావకాశమే.

ఏయే పరిశ్రమల్లో...?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వంద మంది కంటే ఎక్కువ ఉపాధి కల్పిస్తున్న మధ్యతరహా పరిశ్రమలు దాదాపు 50 వరకు ఉండగా, పెద్ద తరహా పరిశ్రమలు 25 వరకు ఉన్నాయి. ఇలాంటి చోట విద్యార్థులకు పలు అంశాల్లో నైపుణ్యాలు పెరిగేలా అవగాహన కల్పిస్తారు.

అర్హులెవరంటే..?

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునే వారు పదో తరగతి, ఇంటర్, బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ పూర్తి చేసి ఉండాలి. ఐటీఐ, డిప్లొమా సైతం పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకానికి 21 నుంచి 24 ఏళ్ల లోపు నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.పిఎం ఇంటర్న్‌షిప్.ఎంసీఏ.జీవోవి.ఇన్‌ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఆధార్ అనుసంధానమైన చరవాణి నంబరు, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అభ్యర్థి ప్రొఫైల్‌లో ఈకేవైసీ పూర్తి చేయాలి. వ్యక్తిగత వివరాలు, విద్యార్హత, చిరునామా, కేటగిరీ, తదితర వివరాలు ఆధార్‌తో అనుసంధానం చేసిన చరవాణి నంబరు, ఈ మెయిల్ ఐడీ, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలి. ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు ఉండదు.

ఏయే పత్రాలు కావాలంటే..?

ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విద్యార్హత, నేటివిటీ సర్టిఫికెట్ ఉండాలి. అయిదింటిలో ఏదైనా ఒకటి ఎంపిక చేసుకోవచ్చు. ఎంపికైతే మీ ఈ మెయిల్‌కు ఆఫర్ లెటర్ వస్తుందని, అధికారిక వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోనే వీలు కూడా ఉందని అధికారులు చెబుతున్నారు.

- దరఖాస్తు ప్రారంభం: అక్టోబరు 12న
- చివరి తేదీ: ఈ నెల 25వ తేదీ లోపు
- దరఖాస్తు దారుల జాబితా విడుదల: ఈ నెల 26వ తేదీ
- ఎంపిక ప్రక్రియ: ఈ నెల 27 నుంచి నవంబరు 7 వరకు
- అభ్యర్థి అంగీకారానికి గడువు: నవంబరు 8వ తేదీ నుంచి 15వ తేదీ లోపు
- ఇంటర్న్‌షిప్ ప్రారంభం: డిసెంబరు 2
- సందేహాల నివృత్తికి: హెల్ప్ లైన్ నంబరు: 1800116090కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చు



తర్ఫీదు పొందుతున్న యువత


ఎంపిక ప్రక్రియ ఇలా..

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఆబ్జెక్టివ్ పరీక్ష నిర్వహిస్తారు. అర్హులైన అభ్యర్థులు పీఎం ఇంటర్న్‌షిప్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులు పూర్తి వివరాలు నమోదు చేయాలి. ఎంపికైన వారికి వారు ఎంచుకున్న పరిశ్రమలకు సంబంధించి నైపుణ్యాలను నేర్పిస్తారు. అర్హత సాధించిన వారు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా ప్రధానమంత్రి సురక్ష బీమా కవరేజ్ కూడా లభించే అవకాశం ఉంది.

వేటిని అందిస్తారంటే..

పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్ అండ్ ఎనర్జీ, మైనింగ్, టెలికాం, రిటైల్, సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్, ఫార్మాస్యూటికల్, ఏవియేషన్, మాన్యుఫ్యాక్చరింగ్, అగ్రికల్చర్, జెమ్స్ జ్యూవెలరీ, ట్రావెల్ హాస్పిటాలిటీ వంటి రంగాల్లో ఇంటర్న్‌షిప్ అందిస్తారు. ఎంపికైన వారికి 12 నెలల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు వన్‌టైం(ఏక కాల) గ్రాంటు కింద రూ. 6వేలతో పాటు ప్రతి నెలా ప్రభుత్వం రూ. 4,500లు, కంపెనీ రూ.500ల చొప్పున డీబీటీ ద్వారా క్రెడిట్ చేస్తారు. ఈ లెక్కన ఏడాదికి మొత్తం రూ. 66వేలు పొందే అవకాశం ఉంది.

సువర్ణఅవకాశమే -డా.జి.రామకృష్ణ, నోడల్ అధికారి, రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు



నిరుద్యోగ యువతకు పీఎం ఇంటర్న్‌షిప్ పథకం సువర్ణ అవకాశమే. డిగ్రీ, డిప్లొమా తదితర కోర్సుల్లో అర్హులైన వారిని ఎంపిక చేసి జాతీయస్థాయిలో వివిధ అగ్రశ్రేణి సంస్థల్లో నైపుణ్యాలు పెంపొందేలా ప్రోత్సహిస్తారు. విద్యార్థులు అభిరుచికి అనుగుణంగా శిక్షణ పొందే వీలుంది. శిక్షణాకాలంలో మెలకువలు, నైపుణ్యాలు పెంపొందించుకోవడం వల్ల వారి భావి ఉద్యోగ జీవితానికి గట్టి పునాది పడుతుంది. ఆసక్తి ఉండి అర్హత ఉన్న వారు వినియోగించుకోవాలి.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకటశేషాద్రి సూచించారు. నంద్యాల పట్టణంలోని ప్రత్యేక సబ్ జైలును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలతో సమావేశమయ్యారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలుంటే వైద్యులే సబ్ జైలుకు వచ్చి చికిత్సలు అందిస్తారని చెప్పారు. అనంతరం జైలు దస్త్రాలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాది బాలునాయక్, సబ్‌జైలు పర్యవేక్షకులు గురుప్రసాదరెడ్డి, లీగల్ సెల్ సిబ్బంది రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకటశేషాద్రి

ట్రాన్స్‌జెండర్లకు సమాన అవకాశాలు కల్పిస్తాం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : సమాజంలో పురుషులు, మహిళలతో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా సమాన అవకాశాలు కల్పిస్తామని కలెక్టర్ జి.రాజకుమారి చెప్పారు. నంద్యాల సెంటినరీ హాల్‌లో బుధవారం ట్రాన్స్‌జెండర్లకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 240 మంది ట్రాన్స్‌జెండర్లు పింఛన్లు పొందుతున్నారని తెలిపారు. వైద్య శాఖ నివేదికలో 690 మంది ఉండగా, ఎన్జీవో సంస్థలు వెయ్యిమంది ఉన్నట్లు చెబుతున్నారని, జిల్లాలో వాస్తవంగా ఎంతమంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారో జాబితా సమర్పించాలని ఎన్జీవో సంఘాలను ఆదేశించారు. ఎంతమందికి రేషన్‌కార్డులు, ఓటరు కార్డులు ఉన్నాయి, వారు ఏమేం పనులు చేస్తున్నారన్న వివరాలతో వారం రోజుల్లో నివేదిక అందజేయాలన్నారు. నూతన విధానం ప్రకారం జిల్లాలోని అందరికీ గృహాలు మంజూరు చేస్తామన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ట్రాన్స్‌జెండర్లతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రయీస్ ఫాతిమా, డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, అదనపు డీఎంహెచ్‌వో శారదాబాయి, డీఎస్‌వో వెంకటరాముడు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రవీంద్రకుమార్, మైనారిటీ కార్పొరేషన్ ఈడీ సబీహా పర్వీన్, ఉపాధి కల్పనాధికారి సోమశేఖరరెడ్డి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం నీటిమట్టం 884.40 అడుగులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం నీటిమట్టం బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 884.40 అడుగులు, నీటినిల్వ 211.9572 టీఎంసీలుగా నమోదైంది. ఎగువనున్న జూరాల ప్రాజెక్టు నుంచి 73,573 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 67,726 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.



చాగలమర్రిలో నీట మునిగిన మొక్కజొన్న



బనగానపల్లి మండలం ఉంగుటూరు వద్ద ఉప్పొంగిన అలుగువాగు

వాన కురిసే.. కన్నీరు ఒలికే!

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగుతుండటంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు కన్నీరు కారుస్తున్నారు. చేతికొచ్చిన పంట నీటి పాలైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -న్యూస్‌టుడే, చాగలమర్రి, బనగానపల్లి గ్రామీణం, ఆత్మకూరు.

పంటంతా కుళ్లిపోతుంది

- సురేంద్ర, నల్లకాల్వ

నేను ఎకరం సొంత పొలంతో పాటు 16 ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశా. వరుస వర్షాల కారణంగా పంట దెబ్బతింది. ఎకరాకు రూ.18,500 నష్ట పరిహారం ఇచ్చారు. మిగిలిన పంటను దసరా తర్వాత కోద్దామనుకున్నా. మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. పొలం ఆరడానికి మరో పది రోజులు సమయం పట్టేలా ఉంది. కంకులు ఒరిగిపోయాయి. నేలను తాకిన కంకుల నుంచి మొలకలొస్తున్నాయి. ఇలాగే వర్షాలు కురిస్తే పంటంతా కుళ్లిపోతుంది.



రంగు మారిన పైరు

- ప్రణీత్, రైతు కరివేన


మేము ఐదెకరాల సొంత పొలంతో పాటు 15 ఎకరాలు కౌలుకు తీసుకున్నాం. ఖరీఫ్‌లో ఎడతెరిపిలేని వర్షాల వల్ల పంట సాగు చేయలేకపోయాం. దీంతో కౌలు భారం రూ.4.5 లక్షలు మీదపడింది. సెప్టెంబరు చివర్లో మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న మొలకలు ఎర్రగా మారుతున్నాయి. పంటను కాపాడుకునేందుకు యూరియా చల్లడంతో పాటు మందులు పిచికారీ చేయించాం. అయినాసరే పంట ఎర్రగా మారడంతో పనికి రాదంటున్నారు. దీంతో రూ.50 వేల వరకు నష్టం వచ్చింది.



ముంచుకొచ్చిన తుపాను.. అప్రమత్తతే ఆయుధం

- జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ
- మూడు రోజులపాటు భారీ వర్ష సూచన

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తుపాను హెచ్చరికను జారీ చేసిన నేపథ్యంలో రాయలసీమలో సుమారు మూడు రోజులపాటు భారీ వర్ష సూచన ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలు, విద్యుత్తు వినియోగదారులు, రైతులు, పారిశ్రామిక కార్మికులు, ఇతరులు తుపాను కారణంగా విద్యుత్తు ప్రమాదాలపై అవగాహన పెంచుకొని జాగ్రత్తలు పాటించాలని కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యుత్తు శాఖ (ఆపరేషన్స్ సర్కిల్) ఎస్ఈలు ఎం.ఉమాపతి, జి.సుధాకర్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా కంట్రోల్ రూంలు, డివిజన్ల పరిధిలో అత్యవసర సహాయక చర్యలు, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడానికి అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు హెడ్‌క్వార్టర్‌లో విధులు నిర్వహించాలని, సెలవులు పెట్టరాదని సూచించారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు సమస్యలపై టోల్‌ఫ్రీ నంబరు 1912, 18004251555333కు సమాచారం అందించాలని, ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ వాట్సాప్ నంబరు 9133331912కు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోచ్చని సూచించారు.



భద్రత నియమాలు ఇలా

- అధిక వర్షాలు, ఈదురుగాలులు అధికంగా వస్తున్నప్పుడు నీటి నిల్వ అధికంగా ఉన్నచోట విద్యుత్తు స్తంభాలను తాకరాదు. వాటి సమీపంలో ఉండరాదు.
- రైతులు తమ పొలాల్లో విద్యుత్తు మోటార్ల వద్ద జాగ్రత్తలు పాటించాలి. తడి చేతులతో మోటార్లను ఆన్, ఆఫ్ చేయడం చేయరాదు. అతుకులు వేసిన తీగలను మోటార్ల కనెక్షన్లకు ఉపయోగించొద్దు. ఐఎస్ఐ తీగలను వాడుకోవాలి.
- ఎక్కడైనా విద్యుత్తు తీగలు తెగి పడి ఉంటే వాటికి తాకొద్దు. వెంటనే సంబంధిత విద్యుత్తు సిబ్బందికి తెలియజేయాలి.
- రైతులు తమ పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు ఒరుగడం, విరగడం గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించి ప్రమాదాలు జరగకుండా చూడాలి.
- ఉద్యానాలు, మైదానాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు ముట్టుకోవద్దు.
- వర్షం పడేప్పుడు విద్యుత్తు స్తంభాలు తాకరాదు. తీగలకు తగులుతున్న చెట్లను, వాటి కొమ్మలను పట్టుకోవద్దు. అలాంటి సమస్యలుంటే అధికారులకు సమాచారం అందించాలి.
- ఇళ్లలో గోడలపై నిమ్ము ఏర్పడినప్పుడు లేదా తడిచిన స్విచ్ బోర్డు ఉన్నప్పుడు తడి చేతులతో ఆన్ చేయరాదు. ఇంటి బయట ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు వర్షాలకు తడవకుండా చర్యలు తీసుకోవాలి. వీధి స్తంభం నుంచి ఇళ్లకు ఇచ్చే సర్వీసు తీగలకు అతుకులు లేకుండా చూసుకోవాలి.
- ఇళ్లలో విద్యుత్తు పరికరాలను తడి చేతులతో తాకరాదు.

కర్నూలు జిల్లాలో కంట్రోల్‌రూం ఏర్పాటు

ప్రజల సౌకర్యార్థం అతి భారీ వర్షాల హెచ్చరిక జారీ దృష్ట్యా విద్యుత్తు సమస్యలపై కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాలు, డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరా, అంతరాయం, ఇతర సమస్యలపై పర్యవేక్షించనున్నట్లు అధికారులు తెలిపారు.

కంట్రోల్ రూం	చరవాణి నంబరు
కర్నూలు (జిల్లా కంట్రోల్ రూం)	7382614308
కర్నూలు డివిజన్	08518-221919
ఎమ్మిగనూరు డివిజన్	7382787703
ఆదోని డివిజన్	7382614098

నంద్యాల జిల్లాలో

కంట్రోల్ రూం	చరవాణి నంబరు
నంద్యాల డివిజన్	7382788257
ఆత్మకూర్ డివిజన్	7386772611
డోన్ డివిజన్	7382788257

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించే ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి కోరారు. బుధవారం ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో కరపత్రాలను ఎమ్మెల్యే విడుదల చేసి మాట్లాడారు. మూడు ప్రైవేట్ కంపెనీలు హాజరవుతున్నాయని ఏపీఎస్ఎస్‌డీసీ సమన్వయకర్త గోపీనాథ్ తెలిపారు. పది, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, వివరాలకు 9542643747, 9573108032 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు. లక్ష్మీరెడ్డి, హరుణ్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

డెయిరీలో ఉల్లంఘనలపై చర్చ

ఈనాడు, కర్నూలు: నంద్యాల విజయ డెయిరీలో ఎన్టీఆర్ శిలాఫలకాన్ని మురుగుకాలవపై పడేసిన ఉదంతం, దానిపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ తీవ్ర ఆగ్రహం వ్యక్తపర్చడం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఆ డెయిరీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎస్.వి.జగన్‌మోహన్‌రెడ్డికి అఖిలప్రియ వరసకు మేనకోడలు అవుతారు. ఆమె తెదేపాలోనూ, ఆయన వైకాపాలోనూ కొనసాగుతున్నారు. ఎన్టీఆర్ శిలాఫలకాన్ని మురుగుకాలవపై వేయడంతో తీవ్రంగా స్పందించిన ఆమె మంగళవారం నంద్యాలలోని విజయడెయిరీకి వెళ్లి శిలాఫలకానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆమె డెయిరీ ఛైర్మన్ ఛాంబర్‌లోకి వెళ్లినప్పుడే ఎస్.వి.జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్ చేశారు. వారి ఫోన్ సంభాషణలు బుధవారం వైరల్ అయ్యాయి. శిలాఫలకానికి క్షీరాభిషేకం చేయడానికి డెయిరీకి వస్తే ఫోన్ చేసి బెదిరిస్తున్నారా? అంటూ నిలదీశారు. 'మామగా ఫోన్ చేశారా? విజయ డెయిరీ ఛైర్మన్‌గా ఫోన్ చేశారా?' అన్న విషయం ముందుగా చెప్పాలన్నారు. ఆ ఛాంబర్‌లో మాజీ ముఖ్యమంత్రులు వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలే నేటికీ ఉండటంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ గదిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫొటో ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ప్రస్తుత ముఖ్యమంత్రి ఫొటో డెయిరీలో ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. డెయిరీ స్వతంత్ర ప్రతిపత్తి సంస్థ అని ఆయన చెప్పినట్లు సమాచారం. అలాంటప్పుడు వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిల ఫొటోలు ఎందుకు ఏర్పాటుచేశారని ఆమె ప్రశ్నించగా దానికి సమాధానం లేదు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్వయంగా నంద్యాల వచ్చి డెయిరీని ప్రారంభించినప్పటికీ నేటి వరకు ఆయన విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆమె ప్రశ్నించారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని మాత్రం డెయిరీ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఉదంతంపైనా ఆమె నిలదీశారు. ఉమ్మడి జిల్లా మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్‌ల పేర్లను ఉపయోగిస్తూ వారి అండదండలున్నాయని చెబుతూ వారి పేర్లను కూడా గబ్బు పట్టిస్తున్నారని ఎస్.వి.జగన్‌మోహన్‌రెడ్డిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజకీయవర్గాల్లో కలకలం

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ నంద్యాల విజయడెయిరీకి వెళ్లి నిర్వాహకులను నిలదీసిన ఉదంతం రాజకీయంగానూ కలకలం రేపుతోంది. విజయడెయిరీలో గత ఐదేళ్లలో పెద్దఎత్తున అవనీతి, అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపించారు. అవన్నీ త్వరలో బయటపెడతామని ఆమె హెచ్చరించారు. తెదేపా వారి మనోభావాలను దెబ్బతీస్తూ.... ప్రస్తుత మంత్రుల మద్దతు తనకు ఉందని విజయడెయిరీ ఛైర్మన్ చెబుతూ వారిని కూడా బదనాం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఆమె చేసిన వ్యాఖ్యలు, ఫోన్ సంభాషణలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. ఒకప్పుడు భూమా వర్గీయుల చేతిలో ఉన్న విజయ డెయిరీ వైకాపా ప్రభుత్వం హయాంలో ఆపార్టీ అనుకూలురైన ఎస్.వి.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల్లోకి వెళ్లింది. మళ్లీ తెదేపా అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో విజయ డెయిరీపై ఎవరు పట్టు సాధిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

డెయిరీకి, ప్రభుత్వానికి సంబంధం లేదు

■ ఛైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శలు

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: తమ్ముణ్ని ఛైర్మన్ చేయడానికే ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విజయ డెయిరీ విషయంలో హంగామా చేస్తున్నారని ఆ సంస్థ ఛైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం విజయ పాల డెయిరీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎన్టీఆర్‌కు తాము ప్రాధాన్యమిస్తామని, భద్రంగా తీసిపెట్టిన శిలాఫలకాన్ని కొందరు వ్యక్తులు వర్షపు నీరు వెళ్లే కాలువలో వేసి ఫొటోలు తీసి బయటకు పంపే కుట్రపన్నారన్నారు. ఎలాగైనా తమ్ముణ్ని ఈ సంస్థకు ఛైర్మన్ చేసుకోవడానికి అఖిలప్రియ ఇదంతా చేస్తోందన్నారు. నాలుగేళ్లగా ఆదాయంతో సంస్థను నడిపామని, జగత్ పాల డెయిరీ వడ్డీతో కట్టాల్సిన రూ.2 కోట్ల అప్పు చెల్లించి విజయా డెయిరీపై మాట్లాడాలన్నారు. విజయా పాల డెయిరీకి, ప్రభుత్వానికి సంబంధం లేదని, నన్ను ఛైర్మన్‌ను చేశారనే కృతజ్ఞతతోనే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను ఉంచామన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఫొటో ఆమె తెచ్చిపెట్టడంతో మాకు ఖర్చు మిగిలిందన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఫొటోను అలాగే ఉంచామని, పక్కనే జగన్ ఫొటోను ఉంచామన్నారు. ఉమ్మడి జిల్లా ఛైర్మన్ అయిన తనసీట్లో ఎమ్మెల్యే మాత్రమే అయిన ఆమె ఎలా కూర్చొంటుందని ఆయన ప్రశ్నించారు. ఎన్టీఆర్ అంటే మాకు గౌరవం ఉందని, అందుకే ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. శిలాఫలకం కాలువలో పడవేసిన విషయంపై విచారణ చేయాలని పోలీసులను కోరామన్నారు. కొత్త మిషనరీలు తెచ్చి ఆధునిక పద్ధతుల్లో నాణ్యమైన పాలను అందించాలన్న లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు.

తెలుగుగంగ కాల్వలో ఇంటర్ విద్యార్థి గల్లంతు

మహానంది, న్యూస్‌టుడే : మహానంది గ్రామం ఈశ్వరనగర్‌కాలనీకి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి మాఘం గౌతమ్ సిద్ధార్థ (17) తెలుగుగంగ కాల్వలో పడి గల్లంతయ్యాడు. ఎస్సై ఎన్.రామ్మోహన్ రెడ్డి, గ్రామస్థులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన మాఘం పుల్లయ్య, మౌనిక దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. పెద్దవాడైన గౌతమ్ నంద్యాలలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. తండ్రి మృతి చెందడంతో తల్లి మౌనిక తన పుట్టిల్లయిన మహానందికి వచ్చారు. ఆమె ఇక్కడే కూలి పనులు చేసుకుంటుండగా, చిన్న కుమారుడు మేకలను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం వర్షాల కారణంగా కళాశాలకు సెలవు ప్రకటించడంతో ఇంటివద్దే ఉన్న గౌతమ్ మిత్రుడు వెంకటసాయితో కలిసి మేకలను మేపేందుకు వెళ్లాడు. చెంచులక్ష్మి గూడెం సమీపంలో తెలుగుగంగ కాల్వలో ఈతకు దిగారు. వీరిలో గౌతమ్ సిద్ధార్థకు ఈత రానట్లు సమాచారం. ప్రవాహ ఉద్ధృతికి గౌతమ్ కొట్టుకుపోయాడు. తల్లి మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాలింపు చేపట్టామని ఎస్సై వివరించారు.



గౌతమ్ సిద్ధార్థ (చిత్రచిత్రం)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

రహిమాన్‌పురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: రహిమాన్‌పురంలో అప్పుల బాధతో మనస్తాపానికి గురైన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన సలీంద్ర మధు (34) 3.50 ఎకరాల సొంత పొలం, 2 ఎకరాలు కౌలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత సంవత్సరం కందితో పాటు వివిధ రకాల పంటలను సాగు చేశారు. సరైన సమయంలో వర్షాలు కురవకపోవడం, వేసిన పంటలు చేతికి రాక పోవడంతో సుమారు రూ.5 లక్షలు అప్పులు చేశారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య సంధ్యాదేవితో పాటు ఏడాది వయస్సున్న కొడుకు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సలీంద్ర మధు,


సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

ఉప కారాగారం తనిఖీ

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు ఉప కారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న మెనూ, సదుపాయాలు గురించి జైలర్ జనార్దన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో సమావేశం నిర్వహించి న్యాయ సలహాలు ఇచ్చారు. న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదిని నియమించారు.

నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

ట్రాప్ కెమెరాల ఏర్పాటు

మిడుతూరు, న్యూస్‌టుడే : మిడుతూరు సమీపంలోని వేసవి నీటికుంట ఆవరణలో సంచరిస్తున్న చిరుతను గుర్తించేందుకు వీలుగా ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు రోళ్లపాడు డీఆర్వో తాహెర్ తెలిపారు. వేసవి నీటికుంట ఫిల్టర్ బెడ్ల వద్ద, ఆవరణలో బుధవారం రెండు కెమెరాలు అమర్చినట్లు వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం : **సమస్య :** నూనెపల్లెలో బావి వెనుక కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- రాము**

సమస్య : భగత్‌సింగ్ కాలనీలో కుక్కల బెడద అధికమైంది. **- వాసు, స్థానికుడు**

సమాధానం : కాల్వలు శుభ్రం చేయించి, దోమల నియంత్రణకు మందు పిచికారీ చేయిస్తాం.
- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మక్కకు మొలకలు.. రైతుకు కన్నీళ్లు


కోత కోసేందుకు వీలుగాకుండా పడిపోయిన కంకులు


మొలకెత్తిన మొక్కజొన్న కంకి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగు చేసిన రైతులను వర్షాలు నిలువునా ముంచేశాయి. ఆరుగాలం శ్రమ వర్షార్పణమైంది. ఖరీఫ్ ప్రారంభం నుంచి విడవకుండా వానలు కురిశాయి. పంటకు తీవ్ర నష్టం కలిగించాయి. మిగిలిన కొద్దిపాటి పంటను కూడా ప్రస్తుతం అమ్ముకోలేని దుస్థితి నెలకొంది.

పంటను కోత కోసిన రైతులు గత మూడు రోజులుగా పడుతున్న వర్షాలకు దిగుబడులను కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. దసరా తర్వాత పంటను కోద్దామనుకున్న వారికి కన్నీరే మిగిలింది. ఇటీవల వీచిన ఈదురు గాలులకు కంకులతో ఉన్న పంటలు నేలవాలాయి. వర్షాలకు కంకులు తడిసి మొలకెత్తుతున్నాయి. దీంతో పంట కోయలేని పరిస్థితి తలెత్తిందని, తాము పూర్తిగా నష్టపోయామని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 19 వేల హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారు. అధికారులు 14,484 హెక్టార్లలో 10,107 మంది రైతులు పంట నష్టపోయినట్లు గుర్తించారు. రూ. 8.66 కోట్ల మేర పరిహారం ఇవ్వాల్సి ఉంది. మిగిలిన

కోత కోయాలన్నా కష్టమే..

సుమారు 12 వేల ఎకరాల పంటలో సగం మంది రైతులు కోతలు కోసి విక్రయించారు. మిగతా సగం మంది వర్షాల కారణంగా కోత కోయలేని, దిగుబడులు విక్రయించలేని దుస్థితి నెలకొంది.

ధరలు పతనం

వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలియగానే వ్యాపారులు మొక్కజొన్న ధరను అమాంతం తగ్గించేశారు. గత నెలలో క్వింటా ధర రూ.2,300 వరకు కొనుగోలు చేశారు. కొన్ని రోజులుగా వర్షాలు పడుతుండటంతో ధర తగ్గించేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా మొక్కజొన్నలు రూ.1700-1800కు కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం తడిసిందని తక్కువకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు.

కంకులు మొలకెత్తుతున్నాయి - బుజ్జి, కరివేన



నాకు సొంత భూమి లేదు. 9 ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశా. మొదటి నుంచి వర్షాలు దెబ్బతీశాయి. నాలుగెకరాల్లో పంట కోతకోసి అమ్మేశాను. మరో ఐదెకరాల్లో పంట కోత కోయాల్సి ఉంది. ఇటీవల ఈదురు గాలులకు కర్రలు నేలవాలాయి. కంకులపై మొక్కలు పెరిగాయి. వర్షాల కారణంగా కంకులు తడిసి మొలకెత్తుతున్నాయి. భూమి యజమానులు సంతకాలు చేయకపోవడంతో నాకు కౌలు కార్డు రాలేదు. పంట నష్టం తమ ఖాతాలో పడితే ఇస్తామన్నారు. నష్ట పరిహారం జాబితాలో పేరు చేర్చున్నారు. ఇంకా డబ్బు జమ కాలేదంటున్నారు.

పొలంలో నీళ్లు నిలిచాయి - మగ్బుల్, నల్లకాల్వ



నల్లకాల్వ గ్రామ శివారులోని చెరువు అవతల మా పొలం ఉంది. మూడున్నర ఎకరాల్లో మొక్కజొన్న, ఎకరంలో వరి సాగు చేశా. వర్షాలు విడవకుండా పడుతుండటంతో చెరువు నిండింది. పొలంలో మోకాలి లోతు నీళ్లు నిలిచాయి. మొదట్లో వర్షాలకు కొంత పంట దెబ్బతినడంతో ఎకరాకు రూ.6 వేలు చొప్పున పరిహారం ఇచ్చారు. మిగిలిన పంటను కోత కోయడానికి వీల్లేకుండా ప్రస్తుతం పొలంలో నీళ్లు నిలిచాయి.

మూడు రోజులుగా తడుస్తున్న దిగుబడులు


గడివేములలో మొక్కజొన్నలపై నిలిచిన వర్షం నీరు

గడివేముల, న్యూస్‌టుడే : గడివేముల మండలంలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. దీంతో కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్నలు, సోయాబీన్ దిగుబడులు తడిచిపోతున్నాయి. దీంతో చేతికొచ్చిన పంట నీళ్ల పాలవుతోందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడుతుండటంతో దళారులు అమాంతం ధరలు తగ్గించినట్లు వాపోతున్నారు. దిగుబడులు కాపాడుకునేందుకు సౌకర్యం లేని రైతులు దళారులు నిర్ణయించిన ధరకే విక్రయిస్తున్నారు.

వర్షంలోనే మొక్కజొన్నలు - చిన్న హుసేని, గడివేముల



నేను నాలుగెకరాల్లో మొక్కజొన్న సాగుచేశా. పంట కోత కోసి దిగుబడులను ఆరబెట్టా. మూడు రోజులుగా దిగుబడులు వర్షంలోనే ఉన్నాయి. తడవకుండా పట్టలు కప్పాం. విక్రయిద్దామంటే వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. పండిన పంట చేతికందని దుస్థితి నెలకొంది.


నంద్యాల బొమ్మలసత్రం : నంద్యాల- మహానంది మార్గంలో బొల్లవరం మెట్ట సమీపంలో నేలవాలిన వరిపంట


కొత్తపల్లి : దుద్యాల సమీపంలో పొగాకు పొలంలో నిలిచిన నీరు

ఏరుల్లా దారులు.. రాకపోకలకు వెతలు


నంద్యాల బొమ్మలసత్రం : సంజీవనగర్ గేట్ వద్ద రోడ్డుపై మురుగునీరు


నంద్యాల బొమ్మలసత్రం : పురపాలక కార్యాలయం ముందే దురవస్థ

అల్పపీడన ప్రభావంతో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం అయ్యాయి. గుంతలమయమైన గ్రామీణ రహదారులపై నీరు నిలిచి ప్రమాదకరంగా మారాయి. జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలో కాల్వలు ఉప్పొంగి మురుగునీరు ప్రధాన రహదారులపై ప్రవహించింది. దుర్గంధం వెదజల్లుతున్న మోకాల్లోతు నీటిలో రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు అష్టకష్టాలు ఎదుర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలో జాతీయ రహదారికి ఇరువైపులా కాల్వల్లేక వర్షం నీరు రోడ్డుపైనే నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లో పలు రోడ్లపై నీరు నిలిచి వంకలను తలపిస్తున్నాయి. బండి ఆత్మకూరు మండలంలోని ఈర్నపాడు, లింగాపురం, నారాయణాపురం, బండిఆత్మకూరు, బి.కోడూరు తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షంనీరు నిలిచింది. జీసీపాలెం- నారాయణాపురం గ్రామాల మధ్య వాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. – న్యూస్‌టుడే, నంద్యాల క్లస్టరు బృందం


గోస్పాడు : యాళ్లూరు- శిరివెళ్ల రహదారి దుస్థితి


నంద్యాల బొమ్మలసత్రం : డేనియల్‌పురం వద్ద..


బండిఆత్మకూరు : ఓంకారం- బండిఆత్మకూరు మధ్య మద్దిలేరు వాగు ప్రవాహం


మిడుతూరు : నంద్యాల- నందికొట్కూరు ప్రధాన రహదారిపై భారీ గుంతలను చూపెడుతున్న సీపీఎం నాయకులు, విద్యార్థులు


కొత్తపల్లి : దుద్యాల గ్రామంలో వంకలా మారిన ప్రధాన రహదారి


ఆత్మకూరు పట్టణం : కరివేన వద్ద గుంతలమయమైన జాతీయ రహదారిపై నిలిచిన వర్షంనీరు


బండిఆత్మకూరు : ఈర్నపాడులో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షంనీరు

ఉద్యోగ మేళా సద్వినియోగం చేసుకోండి


కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సూచించారు. వేల్పనూరులోని తన స్వగృహంలో బుధవారం ఆయన జాబ్‌మేళాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 22న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ మేళాలో నాలుగు కంపెనీలు పాల్గొంటాయని వెల్లడించారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న సహాధ్యాయులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల రామకృష్ణ విద్యాలయంలో 1990- 91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన శివాజీరాజ్ కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. శివాజీరాజ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. త్వరలో ఆయన కుమార్తె వివాహం జరుగనున్న విషయం తెలుసుకున్న స్నేహితులు వారి కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థులంతా విరాళాలు పోగుచేసి రూ.1,30,500 మొత్తాన్ని శివాజీ రాజ్ భార్య వీరేశ్వరికి బుధవారం అందజేశారు.

మత్తు వైద్యులు కీలకం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : వైద్యరంగం పురోగతిలో అనస్థీషియా వైద్యులు కీలకమని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ పేర్కొన్నారు. ప్రపంచ అనస్థీషియా


డా.మోర్టన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మత్తు వైద్యులు

దినోత్సవం సందర్భంగా స్థానిక సంఘం కార్యాలయంలో బుధవారం డా.విలియమ్ టి.జి.మోర్టన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనస్థీషియా వైద్యుల పాత్ర గురించి అవగాహన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్యులు డా. మధుసూదన్‌రెడ్డి, డా.నాగరాజారెడ్డి, డా.శేషఫణి, డా.మల్లీశ్వరి, డా.రేచల్, డా.మాధవి తదితరులు పాల్గొన్నారు.

శిరస్త్రాణం తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న సీఐ

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని నందికొట్కూరు గ్రామీణ సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జూపాడుబంగ్లాలో బుధవారం ఎస్సై లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వాహనదారులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

ఆత్మకూరులో ఆక్రమణల తొలగింపు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆత్మకూరు పట్టణంలో ఆక్రమణల తొలగింపును పురపాలక అధికారులు వేగవంతం చేశారు. కొద్దిరోజుల కిందట కర్నూలు- గుంటూరు ప్రధాన రహదారిపై ఆక్రమణలు తొలగించిన అధికారులు బుధవారం గౌడు కేంద్రం నుంచి పాత బస్టాండు వెళ్లే మార్గంలో పనులు చేపట్టారు. కమిషనరు రమేష్‌బాబు ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక అధికారులు తెల్లవారుజాము నుంచే దుకాణాల ఎదురుగా ఉన్న రేకులు, బోర్డులు, మెట్లు, బండలను తొలగించారు. కొంతమంది యజమానులు ఆక్రమణల తొలగింపును అడ్డుకున్నారు. పాత బస్టాండు ఆక్రమణల తొలగింపు పూర్తయితే ప్రధాన రహదారిని ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేస్తామని అధికారులు వెల్లడించారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు వీడ్కోలు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో పనిచేసి పదోన్నతితో బదిలీపై


ఏవో నిజాముద్దీన్‌కు జ్ఞాపికలను అందజేస్తున్న ఎస్పీ

వెళ్తున్న ఉద్యోగులకు ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా, సిబ్బంది బుధవారం వీడ్కోలు పలికారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఏవోగా పనిచేస్తూ అనంతపురం జిల్లాకు ఏవోగా వెళ్తున్న నిజాముద్దీన్‌ను, ఆర్‌ఐగా ఆక్టోపస్‌కు వెళ్తున్న రామ్మోహన్‌ను, బదిలీపై వెళ్తున్న ఆర్ఎస్సై వీరన్నను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐలు మంజునాథ్, ఖాదర్‌వలి, కవిత, సురేశ్, ఎస్పీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి తెదేపాతోనే సాధ్యం


పగిడ్యాల : భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, తెదేపా నాయకులు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధి తెదేపాతోనే సాధ్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరు మండలం బిజినవేముల గ్రామంలో బుధవారం ఆయన సీసీ రహదారి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. వైకాపా ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పని చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, సర్పంచి రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు, న్యూస్‌టుడే : మండలంలోని తలముడిపి గ్రామంలో ఎంపీడీవో దశరథ రామయ్య, తహసీల్దారు శ్రీనివాసులు, తెదేపా నాయకుడు వంగాల శివరామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు బుధవారం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.

పగిడ్యాల, న్యూస్‌టుడే : ప్రతి పల్లెలో ప్రజలకు వసతులు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పగిడ్యాల, ప్రాతకోట గ్రామాల్లో బుధవారం ఆయన సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. తెదేపా నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పుల్యాల వాసురెడ్డి, దామోదర్‌రెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, జనసేన నాయకుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు, న్యూస్‌టుడే : మండలంలోని వేంపెంట గ్రామంలో సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. సర్పంచి మేకల సువర్ణమ్మ, తెదేపా మండల నాయకుడు గోవిందు అధికారులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే : మండల కేంద్రం జూపాడుబంగ్లాలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.70 లక్షల వ్యయంతో చేపట్టనున్న పదకొండు సీసీ రోడ్ల పనులకు బుధవారం భూమిపూజ చేశారు. సర్పంచి బాలయ్య, ఎంపీటీసీ సభ్యులు కృపాకర్, వెంకటమ్మ, ఎంపీడీవో గోపికృష్ణ, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న పాల్గొన్నారు.

మహానంది, న్యూస్‌టుడే : పల్లె పండగలో భాగంగా మహానందితో పాటు మండలంలోని తమడపల్లె, అల్లినగరం, శ్రీనగరం గ్రామాల్లో బుధవారం సీసీదారులు, మురుగు కాల్వల నిర్మాణానికి ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, ఎంపీడీవో మహబూబ్‌దౌలా, పీఆర్ ఏఈఈ రాజశేఖరరెడ్డి, ఏపీవో మనోహర్ భూమిపూజలు చేశారు.

ఒంటెళగల (గోస్పాడు), న్యూస్‌టుడే : మండలంలోని ఒంటెళగలలో ఎంపీడీవో అమానుల్లా, తెదేపా మండల ఇన్‌ఛార్జి కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, ఈవోఆర్డీ నాగఅనసూయ, గ్రామ నాయకుడు శీలం భాస్కరరెడ్డి బుధవారం అభివృద్ధి పనులు ప్రారంభించారు.

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో బాగంగా బుధవారం మండలంలోని శింగవరం, సోమయాజులపల్లె, రామాపురం గ్రామాల్లో బుధవారం సీసీరోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఎంపీడీవో దస్తగిరి, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటరాముడు, తెదేపా నాయకులు అల్లె చెన్నారెడ్డి, సూల రామసుబ్బయ్య, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలోని కరిమద్దెల గ్రామంలో బుధవారం రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను తెదేపా నాయకులు ఈశ్వరరెడ్డి, శివారెడ్డి, ఎంపీడీవో వాసుదేవగుప్తా, మండల ఇంజినీరు భాస్కర్ తదితరులు ప్రారంభించారు.


జూపాడుబంగ్లా : అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మీటర్లు అందక.. కష్టాలు తీరక



సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : సున్నిపెంటలో నివసిస్తున్న పలువురు పేదలు తమ నివాస గృహాలకు విద్యుత్తు మీటర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. నెలలు గడుస్తున్నా వారికి ఇంతవరకు నూతన మీటర్లు ఇవ్వలేదు. అధికారులు నిరభ్యంతర పత్రం అడుగుతున్నారని, పంచాయతీ వారు అది ఇవ్వడం లేదని పేదలు వాపోతున్నారు. దీంతో వారు ఒకే మీటరుపై రెండుమూడు ఇళ్లకు విద్యుత్తు వాడుకుంటున్నారు.

☛ సున్నిపెంట కాలనీలో 2016లో అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి ఎస్పీడీసీఎల్ అధికారులు విద్యుత్తు మీటర్లను అమర్చారు. ఆక్రమణలు, అనుమతి లేని కట్టడాలు ఎక్కువ కావడంతో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు తమ అనుమతి లేకుండా విద్యుత్తు మీటర్లు ఇవ్వరాదని ఎస్పీడీసీఎల్ అధికారులకు నోటీసులు ఇచ్చారు. అప్పటి నుంచి వారు కాలనీ వాసులకు కొత్తగా విద్యుత్తు మీటర్లు ఇవ్వడం లేదు. దీంతో అర్హులైన నిరు పేదలు ఇబ్బందులు పడుతున్నారు.

☛ కాలనీలోని ప్రభుత్వ గృహాలను ఆక్రమించి నివసిస్తున్న కొంతమంది తమకూ మీటర్లు కావాలని దరఖాస్తులు ఇచ్చారు. కాలనీలో 130 మందికి పేదలకు మాత్రమే మీటర్లు ఇవ్వాల్సి ఉందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఈ దరఖాస్తులపై విచారించి అర్హులకు మాత్రమే మీటర్లు ఇవ్వాలని కోరుతున్నారు.

నిరభ్యంతర పత్రం ఇచ్చేదెవరు

విద్యుత్తు మీటర్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని నిరభ్యంతర పత్రం అడుగుతున్నారని పేదలు చెబుతున్నారు. గత ప్రభుత్వం 2019లో సున్నిపెంటను గ్రామ పంచాయతీగా చేస్తూ జీవో జారీ చేసింది. దీంతో తమకు నిరభ్యంతర పత్రం కావాలని పలువురు గ్రామ పంచాయతీకి దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ పంచాయతీ పేరుతో ఇద్దరు వ్యక్తులు డీడీ తీసినా ఇప్పటి వరకు నిరభ్యంతర పత్రం ఇవ్వలేదని, దీనివల్ల విద్యుత్తు మీటర్లు మంజూరు కాలేదని స్థానికులు చెబుతున్నారు.

☛ ఇటీవల ఇరిగేషన్‌శాఖ అధికారులు ప్రభుత్వ గృహాలను ఆక్రమించిన వారికి నిరభ్యంతర పత్రాలు ఇచ్చినట్లు పలువురు విమర్శిస్తున్నారు. అర్హులైన పేదలకు ఇవ్వకుండా ఆక్రమణదారులకు ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని పాత బస్టాండులో ఉన్న అన్న క్యాంటీన్‌ను పునః ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనరు రమేష్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు ఎం.ఎ.రషీదు తెలిపారు. ఇంజినీరింగు అధికారులతో కలిసి బుధవారం వారు భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ వారం రోజుల్లోగా అన్న క్యాంటిన్‌లో అల్పాహారం, భోజన వసతి కల్పించనున్నట్లు వెల్లడించారు. ఏఈ షాహీర్‌బాషా, పట్టణ ప్రణాళిక అధికారి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని నందికొట్కూరు నియోజకవర్గ వాల్మీకి బోయ సంఘం నాయకుడు గుజ్జుల గౌరీశ్వరనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని ప్రకటించిందన్నారు. ప్రతి కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహిత మృతదేహం లభ్యం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : ఎస్సార్బీసీ కాల్వలో గల్లంతైన వివాహిత వెన్నెల మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన వెన్నెల (18) గత ఆదివారం పాణ్యం సమీపంలోని ఎస్సార్బీసీ కాల్వలో స్నానం చేసేందుకు దిగి ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మూడు రోజులుగా గాలింపు చేపట్టగా బుధవారం బనగానపల్లి వద్ద మృతదేహం లభించినట్లు ఎస్సై వివరించారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం చామకాల్వ దగ్గర మంగళవారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న సోలేమాన్‌ను గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆయన్ను 108లో జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదం అనంతరం కారు ఆగకుండా వేగంగా వెళ్లినట్లు చెబుతున్నారు. బాధితుడు జూపాడుబంగ్లా మండలం పి.లింగాపురం గ్రామస్థుడిగా గుర్తించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.

శ్రీశైలంలో మద్యం స్వాధీనం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలోకి అక్రమంగా మద్యం తెచ్చిన ఇద్దరిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితులైన బోయ రమేష్, డోకు మల్లేశ్వరరావుల నుంచి ఎనిమిది మద్యం సీసాలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జి.ప్రసాదరావు తెలిపారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

అర్హులైన ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



ఉప కారాగారాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ న్యాయమూర్తి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఉప కారాగారంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని సీనియర్ సివిల్ న్యాయమూర్తి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. బుధవారం ఆళ్లగడ్డ ఉప కారాగారాన్ని తనిఖీ చేసి ఆయన మాట్లాడారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించారు. సొంతంగా న్యాయవాదిని నియమించుకోలేని రిమాండ్ ఖైదీలకు లీగల్ సర్వీసెస్ అథారిటీ తరఫున ఉచితంగా న్యాయవాదిని నియమించి వాదనలు వినిపిస్తామన్నారు. ప్యానెల్ న్యాయవాదులు మోహన్, షహీనా, ఉప కారాగార ఇన్‌ఛార్జి కేసీ వెంకట సుబ్బన్న పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపా. వర్షాలకు విద్యుత్తు తీగల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద, స్తంభాలు తడిచినవి తాకొద్దన్నారు. విద్యుత్తు పరంగా సమస్యలు ఉంటే 1912 నంబరుకుఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

సంజామల, న్యూస్‌టుడే: **సమస్య :** గ్రామంలో అక్కడక్కడ వీధుల్లో దీపాలు వెలగడం లేదు. –రఫీ, సంజామల

సమాధానం: దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –పంచాయతీకార్యదర్శి, సంజామల.

శిరివెళ్ల: **సమస్య:** యర్రగుంట్ల బీసీ కాలనీలో సీసీ రహదారి వేయాలి. –నాగరాజు.

జవాబు: రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. –అయ్యలూరి సుభహాన్ అలీ, సర్పంచి, యర్రగుంట్ల.

అభివృద్ధి పనులకు భూమి పూజ

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: గ్రామీణ, పట్టణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి

సూర్యప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని కోట్రాయి, తిరునాంపల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద అభివృద్ధి పనులకు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేసి ప్రారంభించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల మండలంలోని చిన్నకొప్పెర్ల, పెద్దకొప్పెర్ల, ఎం.గోవిందిన్నె గ్రామాల్లో బుధవారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు ఎంపీడీవో వరప్రసాదరావు, ఈవోపీఆర్డీ ప్రకాష్‌నాయుడు, పీఆర్ ఏఈ చెంచయ్య, ఉపాధి ఏపీవో శ్రీవిద్య, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

సంజామల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావటంతో నేడు గ్రామాల్లో సమస్యలు తొలగి అభివృద్ధి బాట వైపు పయనిస్తున్నాయని వసంతాపురం తెదేపా నాయకుడు బి.నాగరాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వసంతాపురం గ్రామ పంచాయతీతో పాటు హోత్రమాన్‌దిన్నె, బొందలదిన్నె మజారా గ్రామాల్లో అభివృద్ధి పనుల చేపట్టారు.

చాకరాజువేముల(దొర్నిపాడు): చాకరాజువేములలో తెదేపా నాయకుడు నాయుడు ఆధ్వర్యంలో బుధవారం 'పల్లె పండగ' నిర్వహించారు. రూ.36 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణానికి అధికారులు, నాయకులు భూమి పూజ చేశారు.

బనగానపల్లి గ్రామీణం: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో వెంకటరమణ పేర్కొన్నారు. నందవరం, పలుకూరు, రామకృష్ణాపురం, నందివర్గం, గోవిందిన్నెలలో పల్లెపండగ నిర్వహించారు.

యర్రగుంట్ల(శిరివెళ్ల): యర్రగుంట్ల, వెంకటాపురం గ్రామాల్లో గురువారం పల్లె పండుగ ప్రగతి నిండుగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప పేర్కొన్నారు. అభివృద్ధి పనులు చేపట్టే కాలనీలను పంచాయతీ కార్యదర్శి పరిశీలించారు.

గార్లదిన్నె(ప్యాపిలి), న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే కూటమి ధ్యేయమని గార్లదిన్నె సర్పంచి సీమ మనోహరమ్మ పేర్కొన్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల ఆదేశాల మేరకు గార్లదిన్నెలో సీసీ రోడ్డుకు బుధవారం భూమి పూజ చేశారు.

ప్యాపిలి: బూరుగలలో గురువారం నిర్వహించనున్న పల్లెపండగ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి హాజరు కానున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.

బేతంచెర్ల: గొర్లగుట్ట, హెచ్.కొట్టాల, రహిమాన్‌పురం, గూటుపల్లె గ్రామాల్లో పల్లె పండగలో భాగంగా ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎంపీడీవో ఫజల్‌రహమాన్ భూమి పూజ చేశారు.

ముత్యాలపాడు(చాగలమర్రి): ముత్యాలపాడు తోడేంళ్లపల్లె, చక్రవర్తులపల్లె గ్రామాల్లో రూ.58లక్షల ఉపాధి నిధులతో చేపట్టనున్న సిమెంటు రహదారులు మురికి కాలువల నిర్మాణ పనులను బుధవారం ఎంపీడీవో ప్రారంభించారు.

సమస్యలు యథాతథం.. నిత్యం అవస్థలమయం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పురపాలికకు 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చినా శివారు కాలనీల్లో సమస్యలు యథాతథంగా ఉంటున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు దాదాపు రూ.2.80 కోట్లు ఉండగా, తాజాగా మరో రూ.2 కోట్లు అందుబాటులోకి వచ్చాయి. శివారు కాలనీల్లో సమస్యల్ని పరిష్కరిస్తామని దాదాపు రెండేళ్ల కిందట పురపాలక ఛైర్మన్ డా.రామలింగారెడ్డి హామీ ఇచ్చినా వాటి పరిష్కారం మాత్రం జరగలేదు. ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన వీధుల్లో మట్టిరోడ్లే కన్పిస్తున్నాయి.



అశోక్‌నగర్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే...?

☛ ఆళ్లగడ్డ అశోక్‌నగర్‌లో రహదారులు లేక ఆ ప్రాంత ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. చుట్టు పక్కల వీధుల నుంచి అటు బస్టాండుకు, ఇటు కోవెలకుంట్ల రోడ్డుకు చేరుకునేందుకు ఉన్న వాటిలో సీసీ రోడ్లు లేకపోవడంతో బురదమయంగా ఉన్నాయి. ఏన్నో ఏళ్లుగా పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ ప్రాంతం అభివృద్ధికి దూరంగానే ఉంది. ఈ ప్రాంతంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు బురద దారుల్లో నడవలేక ఇబ్బందులు పడుతున్నారు.

☛ శోభానాగిరెడ్డి కాలనీలో ఇప్పటికీ మట్టి దారులే ఉన్నాయి. రాత్రయితే చాలు ప్రజలు తిరగాలంటే భయపడుతున్నారు. రోడ్లు , మురుగు కాల్వలు లేక ఏళ్లుగా ఇబ్బందులుపడుతున్నామని వాపోతున్నారు.

☛ రామలక్ష్మి కొట్టాలలో ఇప్పటికీ రహదారులు అసంపూర్తిగా ఉన్నాయి. కల్వర్టుల నిర్మాణం లేకపోవడంతో పలు వీధులకు అనుసంధానం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే ప్రాంతంలో నాయీబ్రాహ్మణ కాలనీల్లోనూ వర్షం వస్తే బురద రహదారులే దర్శనమిస్తున్నాయి.

☛ విలీన పంచాయతీలైన పి.చింతకుంట, పడకండ్లలో ఇప్పటికీ ఎస్సీ, ఇందిరమ్మ కాలనీల్లో మట్టిరోడ్లే ఉన్నాయి.

☛ విద్యుత్తు డీఈఈ కార్యాలయం పరిధిలో ఆరు వీధుల్లో ఇప్పటికీ మట్టిరోడ్లే శరణ్యమని నివాసితులు వాపోతున్నారు.

☛ 8వ వార్డులోని గాయత్రీ ఆలయం పరిధిలో ఏళ్లు గడుస్తున్నా మట్టిరోడ్లే ఉన్నాయని కాలనీ ప్రజలు వాపోతున్నారు.

ప్రాధాన్యత ప్రకారం పనులు చేపడతాం

–దస్తగిరిరెడ్డి, పురపాలక ఏఈ, ఆళ్లగడ్డ

శివారు కాలనీల్లో రహదారుల ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తాం. కొత్తగా బాధ్యతలు తీసుకున్నాను. కౌన్సిల్ సమావేశంలో చర్చించి ప్రాధాన్యత ప్రకారం పనులను చేపడతాం.



సీసీరోడ్డుకు నోచుకోని శ్రీనగర్ కాలనీలోని రహదారి

ఈ చిత్రంలోని మట్టి రహదారి శ్రీనగర్ కాలనీకి చెందినది. కాలనీలో ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా సీసీరోడ్లకు నోచులేదు. మురుగు కాల్వల నిర్మాణం చేపట్టారు. కొంత మేర సీసీరోడ్డు వేసి ఆపేశారు. దీంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు.

మౌలిక వసతులకు దూరం

బేతంచెర్ల,న్యూస్‌టుడే: బేతంచెర్ల పట్టణంలో పలు కాలనీలు అభివృద్ధికి ఆమడ దూరంలో మిగిలిపోయాయి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో పాలకులు ఏమాత్రం కాలనీల అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో సమస్యలతో కునారిల్లుతున్నాయి. నేటికీ సీసీరోడ్లకు నోచుకోలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాలనీల్లో కనీస సదుపాయాల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వివిధ పన్నుల రూపంలో నగర పంచాయతీకి ఆదాయం వస్తున్నా ప్రగతిదాయక అభివృద్ధి జరగడం లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. నగర పంచాయతీలో మొత్తం 20 వార్డులు ఉండగా, 45 వేల మంది జనాభా ఉన్నారు. 11,250 గృహాలు ఉన్నాయి. దీనిపై కమిషనర్ ప్రసాద్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

19న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్యాపిలి, న్యూస్‌టుడే: రాచర్ల ప్రియా సిమెంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కర్మాగారం యాజమాన్యం బుధవారం తెలియజేసింది. బోయిన్‌చెర్వుపల్లె, రాచర్ల, లక్ష్మీతాండ, నేరుడుచెర్ల, కొమ్మెమర్రి, మద్రికుంటతాండ, సీతమ్మతాండ, బూరుగల, గార్లదిన్నె, అలేబాద్‌తాండ, అలేబాద్ గ్రామాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరానికి వచ్చే వారికి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని సెయింట్ జోసఫ్ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ చూపి బహుమతి సాధించింది. ప్రధానోపాధ్యాయిని సిస్టర్ గీతా, వ్యాయామోపాధ్యాయుడు ఓబులేసు, హర్ష తదితరులు అభినందించారు.



బహుమతిని సాధించిన విద్యార్థినితో ప్రధానోపాధ్యాయిని

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఎస్.కొత్తపల్లె(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఉయ్యాలవాడ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం ఎస్.కొత్తపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం' కింద వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

బేతంచెర్ల,న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల ఎలాంటి అంటు వ్యాధులు రావని, వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యవంతులు కాగలరని ఏపీ మాస్ కోఆర్డినేటర్ షణ్ముఖ అన్నారు. బుధవారం పపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఈఓ అరుణ, ఆర్పీలు పాల్గొన్నారు.

సురక్షిత ఆవాసాల్లో ఉండాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పాత ఇళ్లల్లో ఉంటున్న ప్రజలను తహసీల్దారు జ్యోతి రత్నకుమారి హెచ్చరించారు. బుధవారం ఆమె పాలసాగరం పరిధిలో పర్యటించారు. శిథిలావస్థకు చేరిన మట్టిమిద్దెలను గుర్తించి ఆయా గృహాలను ఖాళీ చేసి సురక్షిత ఆవాసాల్లో ఉండాలన్నారు. వక్కిలేరు వాగు ఉద్ధృతిని పరిశీలించారు. వీఆర్వోలు, వీఆర్ఏలు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలన్నారు. వీఆర్వో గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



పర్యటిస్తున్న తహసీల్దారు

వాన కురిసింది... వేదన మిగిల్చింది..

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు ఆవేదన చెందుతున్నారు. పొలాల్లో నీటి నిల్వలను చూసి కన్నీరు కారుస్తున్నారు. అకాలవర్షాలు ఎనలేని నష్టాన్ని తెచ్చాయని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.


–న్యూస్‌టుడే బృందం



శిరివెళ్ల మండలంలోని గుంప్రమాన్‌దిన్నెలో



తిమ్మాపురం–నందవరం గ్రామాల వద్ద పచ్చర్ల వాగు



బనగానపల్లి సమీపంలో మొక్కజొన్న తడిసిపోవడంతో ఆరబెట్టుకుంటున్న రైతులు



కోవెలకుంట్లలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న కుందూ



రుద్రవరం: రుద్రవరం–శిరివెళ్ల రహదారి వర్షానికి ఇలా..

అక్రమ మద్యం పట్టివేత

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గుల్లదుర్తిలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి బుధవారం తెలిపారు. కె.మద్దిలేటి నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన బైరి ప్రసాదు, నాగేళ్ల సునీలు మద్యం తాగి ద్విచక్ర వాహనాలపై వెళ్తుండటంతో ఎస్సై రామాంజనేయరెడ్డి వారిని అరెస్ట్ చేశారు. కోవెలకుంట్ల న్యాయస్థానంలో హాజరుపర్చగా... న్యామూర్తి షేక్ అబ్దుల్ రహేమాన్ రూ. 5, 000 జరిమానా, 30 రోజుల జైలు విధించినట్లు ఎస్సై రామాంజనేయరెడ్డి తెలిపారు.

వర్మీకంపోస్టుతో ఆదాయం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేసి పంచాయతీకి ఆదాయం సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో వరప్రసాదరావు, ఈవో పీఆర్డీ ప్రకాష్ నాయుడు తెలిపారు. కోవెలకుంట్లలోని కుందూనది ఒడ్డున ఉన్న ఉద్యానంలో తొట్టెలను ఏర్పాటు చేసి సేకరించిన చెత్తను వర్మీ కంపోస్టు ఎరువులుగా మార్చేందుకు బుధవారం ఎంపీడీవో, ఈవోఆర్డీలు వానపాములను వదిలారు.



వానపాములను వదులుతున్న ఎంపీడీవో, ఈవోఆర్డీ

సంజామలలో 44.8 మి.మీ. వర్షపాతం నమోదు

సంజామల, న్యూస్‌టుడే: సంజామల మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు 44.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

నిధులు విడుదల చేయాలని విన్నపం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడలో రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌ను ఏపీ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీఎల్) ఛైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రావాల్సిన నిధులు విడుదల చేయాలని కోరారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు పూజలు

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: స్మార్ట్‌మీటర్లు ఏర్పాటుకు సంబంధించి ఏడీఈ సతీష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఏఈ రామమోహన్, విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపాలస్వామికి అభిషేకాలు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: వల్లంపాడులో గోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం అర్చకుడు నరేష్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు.

ఆర్థిక సాయం అందజేత

ప్యాపిలి, న్యూస్‌టుడే: ఏకలవ్య సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఏపీవైఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, ఏకలవ్య సేవా సమితి వ్యవస్థాపకురాలు సీహెచ్ మనోరమ పేర్కొన్నారు. బుధవారం డోన్‌కు చెందిన మోటా రాముడు కుమార్తె కల్యాణానికి ఏకలవ్య సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు.

వాల్మీకి జయంతిని జయప్రదం చేయాలి

ప్యాపిలి, న్యూస్‌టుడే: వాల్మీకి జయంతిని పండగలా జరుపుకోవాలని రాష్ట్ర ఎంవీఆర్పీయస్ సంయుక్త కార్యదర్శి బంగి నాగరాజు, జక్కలచెరువు రామాంజినేయులు పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని పత్తికొండలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం వాల్మీకి సోదరులు 8 బియ్యం ప్యాకెట్లను వారికి అందజేశారు. అచ్చన్న, నాగరాజు, జయన్న, జయరాముడు, ప్రసాద్, వెంకటేష్, హనుమప్ప పాల్గొన్నారు.

పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి

బనగానపల్లి, న్యూస్‌టుడే: పోషక విలువలున్న ఆహారం తీసుకోవడంతోనే చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త జి.ధనలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం కృషివిజ్ఞాన కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు



మాట్లాడుతున్న ధనలక్ష్మి

బాధిత కుటుంబానికి పరామర్శ

డోన్‌పట్టణం: కొండపేటలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు జోసెఫ్(52) గుండెపోటుతో మృతి చెందడంతో ఛైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్, సీఐటీయూ నాయకుడు శివరాం తదితరులు కొండపేటలోని మృతుడి స్వగృహాన్ని సందర్శించి మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి సంతాపం తెలిపారు. రూ.15వేల ఆర్థికసహాయాన్ని అందించారు. ఒకరికి ఉద్యోగం ఇస్తామని తెలిపారు.

పంట నమోదు జాబితా ప్రదర్శన

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలో 2024 ఖరీఫ్‌లో పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాను బేతంచెర్ల మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం గొరుమానుకొండ రైతు సేవా కేంద్రంలో రైతుల పంట నమోదు జాబితాను ప్రదర్శించారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

దొర్నిపాడు, న్యూస్‌టుడే: గ్రామాల్లో అవకతవకలకు పాల్పడితే తగు చర్యలు తీసుకుంటామని పీడీ జనార్దన్‌రావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: డోన్ పట్టణంలోని ఆటోనగర్‌తో పాటు తారకరామానగర్‌లో సీసీ రహదారులు, ఇంటింటికీ తాగునీరు, సీసీ కాలువలు వంటి కనీస సౌకార్యలను కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి కోయిలకొండ నాగరాజు డిమాండు చేశారు. బుధవారం తారకరామానగర్‌లో సీపీఎం శాఖ ఆధ్వర్యంలో రెండో మహాసభలను పార్టీ నాయకుడు అక్బర్ బాషా అధ్యక్షతన నిర్వహించారు. తారకారామ నగర్ శాఖ కార్యదర్శిగా ఎస్. అక్బర్‌బాషాను ఎన్నుకున్నారు. ఖల్లుమ్‌బీ, మదార్‌బీ, రామాంజనమ్మ, మహబూబ్‌బాషా, ఏసురత్నం, సుధాకర్, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కోయిలకొండ నాగరాజు

చోరీకి విఫలయత్నం

మాచినేనిపల్లె(రుద్రవరం): మాచినేనిపల్లెకు సమీపంలోని గోపాల్‌కు చెందిన గోదాం వద్ద ఓ దొంగ చోరీకి యత్నించి విఫలమయ్యారు. చోరీకి ప్రయత్నించినట్లు సీసీ కెమెరాల్లో కన్పించడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు గోదాం యాజమాని గోపాల్ తెలిపారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల మండలంలోని పెద్దకొప్పెర్లలో ఈనెల 15న జరిగిన గొడవకు సంబంధించి రేవనూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. తెదేపా, వైకాపాకు చెందిన ఇరువర్గాలు ఘర్షణ పడిన సంగతి తెలిసిందే.

పల్లె కబుర్లు

కోవెలకుంట్ల గ్రామీణం: కోవెలకుంట్ల:కోవెలకుంట్ల నుంచి బనగానపల్లె రహదారిలో టీచర్స్ కాలనీ సమీపంలో మురుగు, వర్షం నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు

సౌదరదిన్నె: ఎస్సీ కాలనీలో విద్యుత్తు స్తంభాలకు విద్యుత్ తీగలు అమర్చక ప్రజలు తీవ్ర అవస్థలపాలవుతున్నారు.

బిజనవేముల: కొప్పెర్ల దారిలో చెత్త చెదారం పడేస్తుండటంతో తొలగించాలంటున్నారు. వల్లంపాడు:వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామోత్సవం, అభిషేకాలు నిర్వహించారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు పెద్దలు తెలిపారు.

భీమునిపాడు: చౌడేశ్వరి దేవి ఆలయం మలుపు వద్ద ముళ్లపొదలు పెరిగి, సిమెంటు రహదారి పాడైంది. బాగుచేయాలనికోరుతున్నారు.

చిన్నకొప్పెర్ల: చిన్నకొప్పెర్ల గ్రామ సమీపంలోని నల్లవాగు, వల్లంపాడు సమీపంలోని కప్పలవాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

డబ్ల్యూ.గోవిందిన్నె: మెట్ట వద్ద రహదాకినూ పైపు లైన్ దెబ్బతిని నీరు వృథా అవుతోంది. అధికారులు చర్యలు తీసుకుని పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని అవుకు మలుపు, విద్యుత్తు సబ్‌స్టేషన్‌రైల్వే బ్రిడ్జ్ సమీపంలో రహదారిపై గుంతలు పడి వర్షం నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పేదల ఇళ్లకు కళ

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాల పూర్తికి కూటమి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకొంది. మన ఇల్లు...మన గౌరవం పేరిట అధికారులను లబ్ధిదారుల ఇంటికి పంపి చైతన్యపరుస్తోంది.



లబ్ధిదారులతో సమావేశమైన గృహ నిర్మాణశాఖ అధికారులు

☛ పీఎంఏవైలో మంజూరైన ఇళ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. గత వైకాపా ప్రభుత్వం

బనగానపల్లి నియోజకవర్గంలో మంజూరైన ఇళ్ల వివరాలు

మండలం	మంజూరైన గృహాలు	వివిధ దశల్లో ఉన్న గృహాలు
బనగానపల్లి	1528	406
కోవెలకుంట్ల	1492	891
అవుకు	410	104
కొలిమిగుండ్ల	1304	643
సంజామల	1241	407

ఈ ఇళ్లకు జగనన్న కాలనీల బోర్డులు తగిలించి తామే ఇచ్చినట్లు ప్రచారం చేసుకొంది. గతంలో మంజూరైన ఇళ్లు పూర్తి కాకుంటే వచ్చే ఏడాది కేంద్రం కొత్తవి మంజూరు చేసేందుకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం లబ్ధిదారులతో మాట్లాడి పూర్తి చేయించాలని ఆదేశించింది. అసంపూర్తి ఇళ్ల వివరాలను ఇప్పటికే అధికారులు సిద్ధం చేశారు. ఏ మండలంలో ఎన్ని ఉన్నాయనే దానిపై సమగ్ర సమాచారం సేకరించారు. ఇందుకోసం సచివాయాలనికి ఓ నోడల్ అధికారితో బృందాన్ని ఏర్పాటు చేశారు. వారంతా లబ్ధిదారులతో మాట్లాడి కారణాలు తెలుసుకుంటున్నారు. వారికి పలు సూచనలు అందిస్తున్నారు. గతంలో ఇంటి పనులు ప్రారంభించి పూర్తి చేయని వాటి గడువు త్వరలోనే ముగియనుంది. ఇలాంటి వారు భవిష్యత్తులో బిల్లులు నష్టపోతారు. కొత్త పథకానికి అర్హత ఉండదు. లబ్ధిదారులు నష్టపోకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

–కృష్ణారెడ్డి, డీఈ, గృహనిర్మాణ శాఖ, బనగానపల్లి

లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి. అవసరమైతే స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇస్తారు. ఇప్పటికే రుణం తీసుకుంటే ఇవ్వరు. మార్చి నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలి. నూతన నిధులు రావాలంటే నిర్మాణాలు పూర్తయితే వస్తాయి. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

గోతుల రహదారికి మోక్షం



కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గత వైకాపా అయిదేళ్ల పాలనలో రోడ్లను నిర్లక్ష్యం చేసింది. కోవెలకుంట్లలోని పాండురంగస్వామి దేవాలయం వెనక ఉన్న ఆర్అండ్‌బీ రహదారి నిండా గోతులు ఉండటంతో మూడేళ్ల నుంచి రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి బీసీ అత్యవసర మరమ్మతులకు రూ.9 లక్షలు మంజూరు చేశారు. బనగానపల్లికి వెళ్లే మలుపు నుంచి ముదిగేడు వైపు వేళ్లే దారిలో ఉన్న రైల్వే వంతెన వరకు రహదారికి మరమ్మతులు చేయనున్నారు. ఈనెల 18న టెండర్లు పూర్తికాగానే పనులు ప్రారంభించనున్నట్లు ఆర్అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి తెలిపారు.